## కేజీబీవీల్లో 730 సీట్ల భర్తీ

నిర్మల్ అర్బన్, మే 25 : నిర్మల్ జిల్లాలోని 12 కేజీబీవీ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఇంగ్లిష్, తెలుగు మీడియంలో శనివారం వరకు 730 సీట్లు భర్తీ అయ్యాయని ఇన్‌చార్జి సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 12 కేజీబీవీల్లో రెండు కోర్సుల్లో 40 చొప్పున మొత్తం 960 సీట్లకు గాను ఇంకా 230 సీట్లు ఖాళీగా ఉన్నాయని పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉచిత విద్య, హాస్టల్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, మే 25 : నిర్మల్ జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో జూన్ 8వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి రాధిక తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పోలీసులు, న్యాయస్థాన అధికారులతో సమావేశం నిర్వహించారు. కేసులకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించి పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు, రాజీ కుదుర్చుకునే కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని తెలిపారు.

## నర్సరీల పరిశీలన

దిలావర్‌పూర్, మే 25 : న్యూలోలం, దిలావర్‌పూర్, కాల్వ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను శనివారం ఎంపీవో అజీజ్‌ఖాన్ పరిశీలించారు. ఎండల నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా సాగు నీరు పోయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ప్రీతి ఉన్నారు.

## గర్భిణులు ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవం పొందాలి

నార్నూర్, మే 25 : గర్భిణులు ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవం పొందాలని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. శనివారం ఖంపూర్, చిత్తగూడ గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్తవ్వ, విద్యరాణి, ఆశకార్యకర్త లక్ష్మీబాయి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖానాపూర్, మే 25 : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఖానాపూర్ మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య నిలయాలు

దస్తురాబాద్, మే 25 : అంగన్‌వాడీ కేంద్రాలను ఆరోగ్య నిలయాలు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిత్రకళ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, భారతి, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

## 27న కేవీకే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

ఎదులాపురం, మే 25: రైతులకు సేవలు అందించే కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేవీకే ఆదిలాబాద్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 27వ తేదీన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎదులాపురం, మే 25: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దబ్బగూడ వద్ద శనివారం జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని కృష్ణానగర్‌కు చెందిన నితీశ్ తన భార్యను తీసుకొని ఆదిలాబాద్‌కు వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. తీవ్ర గాయాలైన నితీశ్‌ను అంబులెన్స్ సిబ్బంది రిమ్స్‌కు తరలించారు.

## సప్లిమెంటరీ పరీక్షకు 2399 మంది హాజరు

ఎదులాపురం, మే 25 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. ప్రథమ సంవత్సరంలో1372 మంది విద్యార్థులకు1309 మంది పరీక్ష రాయగా 63 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరంలో1162 మంది విద్యార్థులకు 1090 మంది పరీక్ష రాయగా 72 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్ కుమార్ తెలిపారు.

## 66 మంది గైర్హాజరు

నిర్మల్ అర్బన్, మే 25 : నిర్మల్ జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో శనివారం నిర్వహించిర ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 66 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి జాదవ్ పరశురాం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 909 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 843 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. భైంసాలోని వశిష్ట జూనియర్ కళాశాల, ముథోల్, భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు.

## దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, మే 25 : కార్పొరేట్ (ఇంటర్) కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రభుత్వ పాఠశాలలో, వసతి గృహాల్లో చదివి వార్షిక పరీక్షలో 7.0 జీపీఏ అపై ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ www. telanganapass. cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీవో భగత్ సునీతా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.పదో తరగతిలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్ ఆటోమెటిక్ సిస్టమ్ ద్వారా ఎంపిక చేసి ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థి సమాచారం వారి ఫోన్‌కు మెసేజ్ ద్వారా మాత్రమే పంపిచబడుతుందన్నారు. ఇతర వివరాలకు 9440628538 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి.

నిర్మల్ టౌన్, మే 25 : నిర్మల్‌లో ఉచిత విద్య వైద్య సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. టీఎన్జీవోస్ భవనంలో జూన్ 1వ తేదీన నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి ఉచిత విద్య వైద్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ హాజరుకానున్నారు. రౌండ్ టేబుల్ సమావేశానికి జిల్లాలోని విద్యావంతులు, మేధావులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సాధన సమితి రాష్ట్ర కో కన్వీనర్ సట్టి సాయన్న, బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ సుంకెట పోశెట్టి, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కాంబ్లే సూర్యకాంత్, లంబాడా కుల పోరాట సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రాజశ్యామల మహాయాగం

ఎదులాపురం, మే 25 : ఆదిలాబాద్‌లోని ప్రగతి విద్యాలయ ప్రాంగణంలో గల నర్సింహ స్వామి యోగీశ్వర పీఠంలో లోక కల్యాణార్థం రాజ శ్యామల మహాయాగాన్ని అత్యంత నియమ నిష్ఠలతో నిర్వహించారు. ఇందులో భాగంగా తొలిరోజు శనివారం వివిధ పూజాది కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ గణపతి శ్రీరుద్ర సహిత శ్రీమహాసుదర్శన పూర్వక శత చండీ ప్రయుక్త రాజ శ్యామల మహాయాగాన్ని నర్సింహ స్వామి యోగీశ్వరి పీఠం 55వ వార్షికోత్సం సందర్భంగా చేపట్టగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ వీణ
- విత్తన దుకాణాలు తనిఖీ చేసిన అధికారులు

భైంసా, మే 25: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వీణ అన్నారు. శనివారం భైంసాలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా వ్యాపారులు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే వారి లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు లూజుగా ఉన్న సంచులలో విత్తనాలు కొనుగోలు చేయరాదని, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఏవో రాంచందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి

బోథ్, మే 25 : రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా


ఇచ్చోడ: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో దీపక్


భైంసా: తనిఖీలు చేస్తున్న ఏడీఏ వీణ

ఉండాలని వ్యవసాయ విస్తరణాధికారి శ్యాం అన్నారు. శనివారం మండలంలోని అందూర్, కంటేగాం, గ్రామాల్లో ఏఈవో శ్యాం సుందర్ రెడ్డి రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. అనంతరం విత్తన దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యాం మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రసీదుపై రైతు పేరు, గ్రామం, విత్తనం పేరు, లాట్ నంబర్, కొనుగోలు చేసిన ప్యాకెట్ల సంఖ్య, రైతు సంతకం, డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. విత్తన ప్యాకెట్‌పై ఉన్న వివరాలు చూసి కొనుగోలు చేయాలని సూచించారు.

ఇచ్చోడ(సిరికొండ), మే 25 : విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం సిరికొండ మండలం రాయిగూడ, లచ్చింపూర్(బీ), నారాయణపూర్ గ్రామాల్లో ఏఈవోలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు దీపక్, రోహిణి, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

### కంపెనీ విత్తనాలు విక్రయించాలి


బోథ్: కంటెగాంలో విత్తన దుకాణం తనిఖీ చేస్తున్న ఏఈవో శ్యాం సుందర్ రెడ్డి

ఇచ్చోడ, మే 25 : ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలు విక్రయించాలని నర్సాపూర్ క్లస్టర్, ఏఈవో మనీషా అన్నారు. మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ స్టాక్ బోర్డుపై వివరాలు రాయాలన్నారు. జల్దా గ్రామంలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు

నార్నూర్, మే 25 : డీలర్లు విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జాడి రాజ లింగం హెచ్చరించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లు, ఆయాశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో నార్నూర్ సీఐ రహీంపాషా, వ్యవసాయ అధికారి గిత్తే రమేశ్, నార్నూర్, తాడిహత్నూర్ డీలర్లు పాల్గొన్నారు.

## నీటి తొట్టెలు ఏర్పాటు


కరంజి(టీ)లో తొట్టెలో నీరు పడుతున్న సిబ్బంది

భీంపూర్, మే 25 : కరంజి(టీ), ఇందిరానగర్ తదితర గ్రామాల్లో పశుసంపద దాహార్తి తీర్చడానికి శనివారం పంచాయతీ సిబ్బంది పశువుల నీటి తొట్టెలలో నీరు నింపారు. ఇక్కడి బోర్ మరమ్మతులు చేయించి ఎండలకు పశువుల నీటికి ఇబ్బంది కాకుండా చూస్తున్నారు. కార్యదర్శి నితిన్ , సిబ్బంది అశోక్, నర్సింహులు రోజూ పశువుల తొట్టెలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలను మరువద్దు


పూజలు చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్ రూరల్, మే 25 : ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలను మరువద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని లక్కెట్టిపేట గ్రామంలో ఆర్క పరివార్ నిర్వహించిన బావే మహీనా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి పెర్సపేన్ దేవుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రం సందర్శన


పరీక్షా కేంద్రం వద్ద ఇంటర్ విద్యాధికారి పరశురాం

భైంసా, మే 25 : భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని శనివారం జిల్లా ఇంటర్ విద్యాధికారి పరశురాం సందర్శించారు. ఆయన వెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జుపిషియా సుల్తానా, తదితరులు ఉన్నారు.

## హనుమాన్ దీక్షాపరుల శోభాయాత్ర

ఎదులాపురం, మే 25 : ఆదిలాబాద్‌లో హనుమాన్ పల్లకీ శోభాయాత్ర హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక రాంలీలా మైదానంలో హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన పట్టణ పురవీధుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి జోగు రామన్న, మఠాధిపతి యోగానంద సరస్వతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్, రామ నామస్మరణతో ర్యాలీ ఘనంగా కొనసాగింది.


హనుమాన్ పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న, మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి

## చివరి గింజ కొనే వరకు ప్రభుత్వంతో పోరాడుతాం

కుంటాల, మే 25 : కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం చివరి గింజకొనే వరకు ప్రభుత్వంతో పోరాడుతామని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. కుంటాల మండలం ఓలాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. డీసీఎంఎస్ కౌంటర్ ఏజెంట్ కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్ బాబుతో ఫోన్‌లో మాట్లాడి తగిన ట్రక్కులు అందుబాటులో ఉంచాలని కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. అకాల వర్షాల వల్ల రైతులకు ఇబ్బంది కలుగుతోందని, ధాన్యం తడవడంతో తేమ శాతం పడిపోతుందని అన్నారు. దీని వల్ల కౌంటర్ల వద్ద మూడు నుంచి ఐదు కిలోలు కటింగ్ పేరిట రైతులు నష్టపోతున్నారని జేసీకి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తడిసిన ధాన్యాన్ని కూడా కొనాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంపీపీ అప్క గజ్జారాం, ఎంపీటీసీ కట్ట రవి, నాయకులు జీవీ రమణారావు, జక్కుల గజేందర్, పిప్పెర వెంగల్‌రావు, సుదర్శన్ పటేల్, సోఫి, శరత్‌గౌడ్, వేముల సాయి ఉన్నారు.


కుంటాల: ఓలా కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తేమ శాతాన్ని పరీక్షిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

### సాయం అందిస్తాం

ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం అందేటట్లు చూస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఓలాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లను ఆయన పరిశీలించారు. ఆదుకోవాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. నష్ట పరిహారం అందేటట్లు చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### పరామర్శ

లింబా(కే)లో కాసిగిరి గంగవ్వ, కుంటాలలో అల్లాల గజ్జన్ రావు, కల్లూరులో ర్యాపెన్ గణేశ్, ఓలాకు చెందిన నాలం కళావతి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్క గజ్జారాం, నాయకులు కట్ట రవి, గుద్దేటి నర్సయ్య, జీవీ రమణారావు, వెంగల్ రావు, జక్కుల గజేందర్, గోవర్ధన్, శరత్ గౌడ్ ఉన్నారు.

### చెరువుకు మరమ్మతులు చేయించండి

కుంటాల మండలం సూర్యాపూర్ గ్రామంలోని చెరువుకు గల రెండు తూము గేట్లకు వానకాలంలోపు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకరావాలని గ్రామస్తులు భైంసాలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కలిసి విన్నవించారు. భారీ వర్షాల వల్ల చెరువు నీరు బొర్లినప్పుడు దిగువ ప్రాంత సూర్యపూర్, వెంకూర్ గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉందని గ్రామస్తులు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. కలిసిన వారిలో దొంతుల గజ్జారాం, కుభీర్ రాజన్న, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం గుర్తింపు పొందిన విత్తనాలు అందించాలి

ఇచ్చోడ, మే 25 : వానకాలం సీజన్‌లో రైతులకు ప్రభుత్వం గుర్తింపు పొందిన పత్తి, సోయాబిన్, విత్తనాలను అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖాధికారులు, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు కలిసి నకిలీ విత్తనాలు అమ్ముకునే వారిపైన దృష్టి సారించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకొని వారిపైన ఏజెన్సీని రద్దు చేసి పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం దూర దృష్టితో ఆలోచించి రైతులకు గుర్తింపు పొందిన విత్తనాలు అందించినట్లయితే ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు విష్ణు, ప్రకాశ్, రాము, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

## పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్

సారంగాపూర్, మే 25: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం రూరల్ సీఐ శ్రీనివాస్ తనిఖీ చేశారు. రికార్డులు, జరిగిన క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన


కప్పర్లలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి

తాంసి, మే 25: బండల్‌నాగాపూర్ గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీవో మోహన్ రెడ్డి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఉపాధి కూలీలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి హమీద్, ఫీల్డ్ అసిస్టెంట్ బుచ్చన్న, భూతం హనుమాన్లు, మోటి వెంకటి, కట్కాజి మల్లేశ్, గంగాధర్ ఉన్నారు.

## నకిలీ విత్తనాల తయారీదారులను జైలుకు పంపాలి

జైనథ్, మే 25: నకిలీ విత్తనాలు తయారు చేయడంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒక వ్యాపారం లాగా నడుస్తున్నదని, నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న వ్యక్తులను నాన్ బెలేబుల్ వారెంట్ కింద కేసులు పెట్టి జైలుకు పంపాలని బీజేపీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ఏనుగు రాకేశ్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి దుకాణాన్ని తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సిడాం రాకేశ్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏనుగు రాకేశ్ రెడ్డి

## కలప స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కలపతో అటవీ శాఖాధికారులు

ఇచ్చోడ(సిరికొండ), మే 25 : సిరికొండలోని ఓ వడ్రంగి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన కలపను శనివారం అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారి గిరయ్య మాట్లాడుతూ ఎవరు అక్రమంగా కలప నిల్వ, రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ రూ.25 వేలు ఉంటుందని తెలిపారు. దాడిలో బీట్ ఆఫీసర్ ఈశ్వర్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ


ఇంద్రవెల్లి: పరామర్శిస్తున్న ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

ఇంద్రవెల్లి, మే 25: గౌరాపూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కొండిబా తల్లి శుక్రవారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సింగరే భరత్, కాటం రమేశ్, దావుల రమేశ్ ఉన్నారు.

జైనథ్, మే 25: గిమ్మ గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై మామిడిపెల్లి కిరణ్, మంద సంటెన్న మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం మాజీమంత్రి జోగు రామన్న పరామర్శించారు. అలాగే గిమ్మ ఎంపీటీసీ కోల భోజన్నను పరామర్శించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ గోవర్ధన్, మాజీ ఎంపీపీ ప్రమీళ లింగారెడ్డి, గిమ్మ ఎంపీటీసీ కోల భోజన్న, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎం ఊశన్న, నాయకులు కుర్రెల్లి టిల్లు, డీసీసీబీ డైరెక్టర్ పురుషోత్తం యాదవ్ ఉన్నారు

## ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్

భైంసాటౌన్, మే 25: కుంబి గ్రామంలో కొద్ది రోజుల క్రితం చంద్రబాయి అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్ రావు పటేల్ మృతురాలి కూతురు రుక్మాబాయికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

## నేడు పూనగూడకు ఎమ్మెల్యే రాక

తాంసి(తలమడుగు), మే 25 : తలమడుగు మండలం పూనగూడ గ్రామంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పర్యటించనున్నారని బీఆర్ఎస్ తాంసి మండల మాజీ కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్, మండల కన్వీనర్ వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వర్షానికి నష్టపోయిన బాధిత కుటుంబాల సమస్యలు తెలుసుకుంటారని మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. అనంతరం తాంసి మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని పేర్కొన్నారు.

## పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


మాట్లాడుతున్న బాసర డిప్యూటీ రేంజ్ అధికారి నజీర్‌ఖాన్

ఖానాపూర్, మే 25: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్న శిఖరాలకు చేరుకోవాలని బాసర డిప్యూటీ రేంజ్ అధికారి నజీర్‌ఖాన్ అన్నారు. శనివారం పట్టణంలోని బర్కత్‌పూర కాలనీలోని ఉర్దూ భవన్‌లో ఇఖ్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్ సెమినర్‌కు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు తమ భవిష్యత్‌పై మార్గదర్శ సూచనలు చేశారు. కార్యక్రమంలో టీఎంఈఏ కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్, వాహిద్‌ఖాన్, సోయాబ్, షేక్ ఇమ్రాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

దస్తురాబాద్, మే 25 : పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎల్‌పీవో రమేశ్ సూచించారు. మండలంలోని మున్యాల, భూత్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, నర్సరీలు, రికార్డులను పరిశీలించారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేయాలని, ఎరువుల తయారీపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

## కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

దస్తురాబాద్, మే 25 : ఉపాధి హామీ కూలీలకు పని చేస్తున్న ప్రదేశాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు, జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రేవోజిపేట గ్రామంలో పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన కూలీ రోజుకు రూ 500 చెల్లించాలన్నారు. ఆయన వెంట కూలీలు, తదితరులు ఉన్నారు.

## కౌన్సిలర్‌ను పరామర్శించిన చైర్మన్


కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ అర్బన్, మే 25 : ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి పడి పట్టణంలోని దేవిబాయి దవాఖానలో చికిత్స పొందుతున్న కౌన్సిలర్ నేరేళ్ల వేణును శనివారం నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరారు.

## ఘనంగా పెర్సపేన్ ఊరేగింపు


పెర్సపేన్‌ను ఊరేగిస్తున్న ఆదివాసులు

ఇచ్చోడ(సిరికొండ), మే 25 : సిరికొండ మండలం కోసు పటేల్‌గూడలో శనివారం పెర్సపేన్ ఊరేగింపు నిర్వహించారు. కుమ్రం భీంరావ్ కటోడ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కొత్తగా పెళ్లి అయిన కోడలు నువ్వులు, కొబ్బరి మురళ వాటిని దేవతకు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గంగాజలంలో స్నానం ఆచరించారు. రాత్రి పెర్సపేన్ దేవుడు మహాపూజ ఉంటుందన్నారు. డోలు సన్నాయి వాయిద్యాలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కుమ్రం కోసేరావ్, కటోడ కుమ్రం సోనేరావ్, రావుజీ పటేల్, కుమ్రం యాదవ్‌రావ్, కుమ్రం జంగుబాపు, కుమ్రం ఇస్రు, జుగదిరావ్, చిత్రు, జనార్దన్, శివకుమార్ పాల్గొన్నారు.